


కామేశ్వరమ్మ మా పిన్ని కూతురు.

మాటల్లో మాటగా కొంచెం చనువు తీసుకుని అన్నాను. "శంకరానికి బాధ్యత లేకుండా చేస్తే వాడిలాగే తయారవుతాడు. వాడికి వదిలెయ్యి వాడే చూసుకుంటాడో లేదో" అని.

"వాడికేం తెలుసు. డబ్బు దుబారా చేసేస్తాడు. కుర్రకుంక" అంది కామేశ్వరమ్మ.

పాడు చేసుకుంటాడో, బాగు చేసుకుంటాడో ఒదిలి చూడు."

కామేశ్వరమ్మ ససేమిరా ఒప్పుకోలేదు. సంసారం యావత్తూ తన సామర్థ్యం మీదనే నడుస్తూన్నట్టు. "ఇవాళ కళ్ళు తెరిచాడు శంకరం. ఈ నాడు నా అంతవాడు లేడంటాడు. ఇన్నాళ్ళూ ఈ సంసారం నా రెక్కమీదనే నడిచింది. ఇవాళ వాడు బజారుపోతే ఉప్పుగల్లు పుట్టదు. ఒక్క వ్యవహారం వాడికి చేతకాదు. వాళ్ళనీ, వీళ్ళనీ దబాయించో,

బ్రతిమాలో తెలివిగా నేనే లాక్కొస్తున్నాను. బయట వ్యవహారాలన్నీ నేను చూసుకుంటున్నాను గనక రోజులు ఈ మాత్రంగానైనా గడుస్తున్నాయి. అప్పు జేసయినా ఇద్దరి ఆడపిల్లలకీ పెళ్ళిళ్లు చేసి కాపరానికి పంపించాను నీలాంటి వాళ్ళ కాళ్లుపట్టుకుని. రోజులెలా వున్నాయి! నోట్లో నాలిక లేకపోతే బజార్లో నిలబడగలమా?" అంటూ ఆమె సహజ ధోరణిలో ఉద్రేకంగా చెప్పుకొచ్చింది.

కాసేపు వియ్యాలవారిమీద నిందలు వేసింది. కోడలిని ఆడిపోసుకుంది. ఆ పిల్లకు వంట చేతకాదుట, మాట తీరు తెలియదుట, పెళ్ళిలో వాళ్ళు అలా చేసారు, ఇలా చేసారని కాసేపు సాధించి పోసింది.

ఆమె వచ్చిన కారణం పాతిక రూపాయలు చేబదులుకోసరం. ఓ ఇచ్చి పంపించేసాను.

కామేశ్వరమ్మ నలుగురికోనూ అల్లరి పడుతూంది. నలుగురూ ఆమెనే తప్పు పడుతున్నారు. అందుకు తగినంత కారణం లేకపోలేదు. ఇద్దరాడపిల్లలకి పెళ్ళిళ్లుచేసి కాపరానికి పంపించేసింది అప్పుచేసి. ఇల్లు తాకట్టుమీద ఆ అప్పు సదుపాయం నేనే చేసాను. వాళ్ళ కాపరాలు బాగానేవున్నాయి. ఒక అల్లుడు బాంకులో ఉద్యోగం. ఇంకో అల్లుడు చిన్నచిన్న కంట్రాక్టు పనులు చేస్తున్నాడు. ఇద్దరికీ ఫర్వాలేదు. డబ్బుకు తడుముకోనక్కర్లేదు- ఇక ఎటొచ్చీ కొడుకు శంకరం మాత్రం అంతంత మాత్రం. అతగాడిది చిన్న ఉద్యోగం. నెలకి రెండొందలకి మించిరాదు. వాడికి ఆ పాటి ఉద్యోగం దొరికేసరికి గగనం అయిపోయింది. ఓ మాదిరిగా సంసారం గడుస్తూంది. పిల్లల పెళ్ళిళ్ళకు చేసిన అప్పులూ, కొడుక్కి ఉద్యోగం దొరికే వరకూ రోజు గడవటానికి చేసిన అప్పులూ బాగా పేరుకుపోయి వున్నాయి. వాటి వడ్డీకిందే నెలకి ఏభై అరవై రూపాయలు కట్టాలి. ఈ మధ్యనే కొడుక్కి పెళ్ళి జరిపించింది. కట్నంలో పదిహేనొందలదాకా మిగిలింది. అది పట్టుకెళ్ళి కూతుళ్ళ పెళ్ళిఅప్పుకు జమకట్టింది. ఇళ్ళ అద్దెలు ఓ వంద వరకూ వస్తాయి. అద్దెలు కామేశ్వరమ్మవసూలుచేస్తుంది. ఆ డబ్బు పెత్తనం ఆమెదే. సగం పెత్తనం కొడుకుదీ, సగం తనదీను. కొడుకు సంపాదించేది ఇంటి మీద వచ్చేది కూడికచేసి ఖర్చు ఒక చేతి మీదుగా జరిపితే ఓ పద్ధతిగా ఉంటుందని తనూ అనుకుంటుంది. కొడుకూ అనుకుంటాడు. కొడుకు మీద తల్లికి


# ANDHRA PRADESH STATE ROAD TRANSPORT CORPORATION

## Even A Public Transport Undertaking Can Operate Profitably

We, at A. P. S. R. T. C. beleive (and have proved) that a Public Transport Undertaking can provide an inexpensive, subsidised transport service, open up developed areas, generate more employment oppertunities, and yet show a PROFIT.

As against a loss of Rs. 183.51 (Lakhs) in 1972–73, we showed a profit of Rs. 3–39 (Crores) in 1973-74

In 1974–75 we maintained the profitability level at Rs. 3·22 (Crores) despite high price increases.

Our fleet utilisation is above 90% and average vehicle utilisation 310 K. M. a day.

Over the next five years, we hope to double our bus fleet to 6000, double our present turnover to over 80 crores and diversify into production of Tyres, critical spare parts and running of motels.

A P. S. R T. C. is today a modern organisation fully geared to meet the demands of the future.

నమ్మకంలేదు. తల్లి మీద కొడుక్కి నమ్మకంలేదు. బహునాయకత్వం. కామేశ్వరమ్మ ఓసారిఅంది. "ఆయన ఒక్కప్పుడే దాటుకుపోయారు. అప్పటికి నాకు నిండా పాతికేళ్ళు లేవు. చిన్నా,చితకలో వేలెడేసి వాళ్ళను పెంచి ఇంతవాళ్ళను చేసాను. ఈ పిల్లలు పచ్చగా, పిల్లాపాపతో సుఖంగాఉంటే చూసి సంతోషించటం తప్ప నేను కోరుకునేదేముంటుంది? నాకేం కావాలి? సంవత్సరానికి నాలుగు గుడ్డముక్కలు, జానెడు పొట్టకు ఇంత అన్నం. అన్నిభోగాలూ ఆనాడు వల్లకాటిలోనే బుగ్గయిపోయాయి. పిల్లలకు ఏం చేసుకుందామన్నా నాకు స్వతంత్రంఏముంటుంది? ఈనాడు వాడి సంసారం వాడికి అమిరింది. వాడి స్వార్థం వాడు చూసుకుంటాడు గాని, ఆడపిల్లల ముద్దుముచ్చట్లు వాడికెందుకు? పిల్లలకి ఏం చేయాలన్నా వాడిని దేభిరించే ఖర్మ నాకేం పట్టింది? వాడి దగ్గర చెయ్యిచాపితే వాడుఇష్టపడొచ్చు, పడకపోవచ్చు" అని. ఆమె ధోరణి నాకేమీ సబబుగాతోచలేదు. ఇంట్లోఉన్నది తనూ, కొడుకూ, కోడలూ, ముసలి అత్తగారూను. కామేశ్వరమ్మకు ముసలిగారి పోరు ఎక్కువ. కొడుకు బ్రతికి ఉన్నప్పుడు ముసలావిడకున్న స్థానబలం ఇప్పుడులేదు. ఆవిడ్ని ఎత్తినాటుగా వచ్చి తిష్టవేసుక్కూర్చున్న చుట్టంలా చూస్తుంది కామేశ్వరమ్మ. ఆ ముసలావిడే నాతో అంది. "కొట్టుకుపోతే కొట్టువాడు నోటికి వచ్చినట్లల్లా కారుకూతలు కూసాడు. ఆ మాటలు ఈ నోటితో చెప్పలేను ఆవిడగారు వెళ్ళదు. నేనేవెళ్ళాలి. ఆ మాటలేవో నేనే పడాలి. ఆవిడ ఉద్దేశం. డబ్బు కట్టేటప్పుడు చేతులూపుకుంటూ దరాగా ఆవిడే వెళ్తుంది. వాడ్ని కాళ్ళావేళ్ళాపడి దేభిరిస్తుంది. ఎందుకొచ్చిన ఖర్మ? ఈ బాధ్యతలన్నీ వాడికి వదిలెయ్యకూడదూ? ఎందుకొచ్చిన రొష్టు. వాడ్ని పొమ్మంటే వాడు నాకెం పట్టింది నేనపోనంటాడు. నెలకు వాడుకునేది వందలకి వందలు. జమకట్టేది ఏభై అరవైను. వాడు ధరలకి ధరలూ పెంచుతాడు. వడ్డీలు కూడా కూడా వేస్తాడు. ఇదంతా తడిసి మోపెడవుతుంది. ఇంటిఖర్చు తగ్గించుకోమంటే తగ్గించుకోదు.




ఖరీదైన బియ్యంకావాలి..' రెండుపూటలా కూరలూ, పచ్చళ్ళూ వుండాలి. రెండు రోజులకోసారి పిండివంటలు కావాలి. శంకరం అన్నాడూ అంటె అనడూ? వాడు పొదుపుగా వుండాలన్నాడని అదంతా కోడలి చెప్పుడుమాటలని వాడిమీద కారాలూ, మిరియాలూ నూరుతుంది. ఆ అమ్మాయిని ఆడిపోసుకుంటుంది. ఈ సంసారం తెరిపిన పడ్డట్టే. వీళ్ళు అప్పులు తీర్చినట్టే అని, ఆప్పటికి వాళ్ళు బాగుపడి పైకి తేలతారనే నమ్మకం లేదు.

కోడలు కాపరానికొచ్చి ఏడాది తిరక్కుండానే కొడుకుని కన్నది. పురుడు పోసింది పుట్టింటివాళ్ళయినా బారసాలకంటూ ఓ వందరూపాయలుపెట్టి బట్టలు కొంది అరువుమీద. బారసాలకు వెళ్ళినప్పుడు వియ్యాలవారు ఇంటిపెత్తనం గురించి ఎత్తుకొచ్చి ఏవేవో సూచనలు చేసారట. ఇంటికొచ్చి నానా గొడవా చేసింది కామేశ్వరమ్మ. ఇంట్లో మనిషికీ మనిషికీ మధ్య ఒకామెలా అభిప్రాయబేదాలూను. చివరిమటుకు వారు శత్రుమధ్యంలో వున్నట్టుంటారు. కోడలు కాపరానికొస్తే కొడుకు కూడా దూరం అయిపోతాడు. తల్లిమనసు అలా తిరుగుతుంది. లేనిపోనివన్నీ మనస్సులో పెంచుకుంటారు. గాలికొట్టిన బుడగల్లా ఊరికే అవి పెరిగిపోతాయి. ఉత్త అనుమానాలు, అపార్థాలూ తప్పించి వాటిల్లో లోతైన వివాదాలు తక్కువ. కోడలు రానంతవరకూ, కొడుకుని అంటిపెట్టుకుని మసలిన కామేశ్వరమ్మ కోడలు రావటంతో తన్నెవరో ఎడంగా తోసేసినట్టు ప్రవర్తించసాగింది. ఇప్పుడా కొడుక్కీ, కోడలికీ మధ్య ఓ నలుసు కూడాను. వాళ్ళమధ్యక్కి చొరబడినప్పుడు ఎలా ప్రవర్తించాలో ఆమెకు తెలియదు. ఫలితం ఎదురుదెబ్బలు. కొడుకు ముఖం చిట్లించుకున్నా, ఒకముక్క ఏదైనా అన్నా ఆమెకు సరిగా అర్థంకాదు. తన ఉన్నతాసనం నుంచి కిందకు దొర్లించి అవమానం చేసినట్టు ఫీలవుతుంది. "చిన్నవాళ్ళు. వాళ్ళమధ్యకు నువ్వలా చొరబడకూడదు" అని ముసలావిడని అంటే "కన్నతల్లిని, నాకా మాత్రం స్వతంత్ర్యం లేదూ, వాళ్ళ ముద్దుముచ్చట్లు చూట్టానికేనా. ఒక్క మంచిమాట చెప్పటానికి నాకు అర్హతలేదూ" అంటుంది కామేశ్వరమ్మ.

వరండాలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నా. పేరంటానికి వెళ్ళిన మా ఆవిడ చేతిలో శనగలమూటతో వస్తూనే "చూశారా కామేశ్వరమ్మ ఏం చేసిందో?" అంటూ ఆరంభించింది.

"ఎప్పుడూ వున్న" గొడవేగా" అన్నాను.

ఆమె ఇన్ని శనగలు నా చేతిలో పోసింది. స్తంభంవార కూర్చుని తీరిగ్గా చెప్పటం మొదలెట్టింది.

"క్రొత్త భాగోతం"

నేను ఆసక్తిగా ఆమెవైపు చూసాను.

"వెళ్ళి కూతురు కొడుకుని పోటీకి తెచ్చింది."

"అందులో పోటీ ఏముంది?"

"ఓ చెంప డబ్బుచాలక చికాకు పడుతూ రోగిష్టివాడ్ని వాడ్నెందుకు ఇక్కడకు లాక్కురావటం? వాడికి పాలఖర్చు, వైద్యం ఖర్చు. వీళ్ళని ఏడిపించటానికి కాకపోతే అన్ని సదుపాయాలూ వున్న చోటునించి వాడ్నెందుకు తీసుకొచ్చినట్టు? వాళ్ళ పిల్లలు వాళ్ళకి బరువా? వాళ్లు చేసుకోలేరూ? మొదట్నించీ ఈమనిషి ఇంతే. కొడుకుకీ, కోడలికీ ఆఖరికి ముసలావిడ కూడా ఇష్టంలేదు"

"ఎన్ని చెప్పిందనుకున్నారు? కొడుక్కీ, కోడలికీ మీనాక్షి కొడుకుని తెచ్చినందుకు అక్కసుగా వుందిట. వాడ్ని వాళ్ళు వేరుగా చూస్తున్నారట. వీడి కూడా ఏదైనా చెయ్యాలని వస్తుందని రోజూ బజారునించి బిళ్ళలూ, బిస్కట్లూ తెచ్చేవాడు. ఇప్పుడవి కూడా తగించేసాడుట. ఒక్కొక్కరోజు గదిలో దూరి వాళ్ళకొడుక్కి మెక్కపెట్టి, ఏవీ ఎరగనట్టు ఇవతల కొస్తారుట. అప్పుడప్పుడు కొడుకునెత్తుకుని షికారు పోతారుట కొడుకూ, కోడలూను. వీడిని కూడాతీసుకెళ్ళమనిఓసారిఅంటే కొడుకు విరుచుకుపడ్డాట. వాడ్ని డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళమంటే కొడుకు చికాకు పడ్డాట. [illegible]మందు కొనమంటే విసుక్కుంటాట్ట. ఈ మధ్య శంకరంకొడుకు ముచ్చటపడి రెండు సెట్లు ఖరీదైనవి కొనుక్కొచ్చాట్ట. ఇంట్లో ఇంకో చంటివాడున్నాడనయినా పట్టించుకోకుండా. ఆ మర్నాడే తాను రెండుసెట్లు వాడికోసం తెప్పించిందట. కామేశ్వరమ్మ కూతురి కొడుకుని చూసినట్టు తమ పిల్లవాడ్ని చూడటం లేదని. పొద్దస్తమానం వాడితోనే సరిపోతుందని, ఇంట్లో పనులన్నీ పూర్తిగా తనమీదకో, ముసలావిడ మీదకో వదిలేసిందనీ, ఆ చంటివాడి బాధ్యత కొంత తనమీదకూ తోసేసిందనీ కోడలు అంది.

"ఇవి అక్కడితోఆగితే ఫర్వాలేదు" అన్నాను.

"అయిందిలెండి. శంకరం బయటపడి అల్లరిచేసాట్ట, చంటివాడ్ని తీసికెళ్ళి మీనాక్షిదగర వదిలేసి రమ్మన్నాట్ట. కామేశ్వరమ్మ అంతకంటె నిర్మొహమాటంగా చెప్పేసిందట. ఈ [illegible] తన భర్తద్వారా సంక్రమించింది, వాళ్ళకి


రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

# శ్రీ వెంకటేశ్వర ట్రేడింగ్ కార్పొరేషన్

ఆళ్ళగడ్డ :: కర్నూలు జిల్లా

ప్రొప్రయిటర్స్: టి. మైసూరయ్య
దేవిశెట్టి బాలసుబ్బయ్యశెట్టి

తనేంచేసినా అనవసరం అని"

ఓనాడు నేను వాళ్ళింటికి వెళ్ళాను. కామేశ్వరమ్మ మంచంమీదపడి మూలుగుతూ వుంది. ఒంటిమీద చెయ్యివేసి చూసాను. జ్వరం చెక్కల మంటలా పేలిపోతూంది. ఆమె పెదాలు వణుకుతున్నాయి. కళ్ళు మూసుకునే గొణుగుతూంది.

"నా యిష్టం నాది, నా డబ్బు నాది. నా మనవడ్ని నేను తెచ్చుకున్నాను, ఇంటికుంకకి అరోగ్యం బాగులేదు, పిలకి ఎడపిల్లలూ, పెడపిల్లలూను, చేసుకోలేక అవస్థ పడుతూంటే తల్లి నై వుండి చూస్తూ ఊరుకోలేక వాడ్ని తీసుకొచ్చాను అంతమాటలంటావా? నిన్నూ అలాగే పెంచాను. ఈ నాడు పెళ్లాం మాటలు పట్టుకుని అంతంతలేసి మాటలంటావా...."

"కామేశ్వరమ్మా" అని పిలిచాను.

నాగొంతువిని పెనుగులాడిఇవతలకి వచ్చింది. "వచ్చావా నాయనా. కామేశ్వ ను ౩౦ రోజుల్నుంచీ జ ప్యాంటు బాగా తడిసింది. పిల్లవాడ్ని అది విడిచి వచ్చిన రోజునించీ అలా పడిపోయింది." అంది.

"ఏకుర్రవాడిని"


"మీనాక్షి కొడుకుని. శంకరానికి దీనికీ ముందు రోజే గొడవ జరిగింది. ఆ మర్నాడే వాడ్ని తీసుకుపోయి దిగవిడిచి వచ్చింది."

వంటి మీద చెయ్యివేసి తట్టి పిలిచాను. కామేశ్వరమ ఉలిక్కి పడ్డట్టుగా కళ్ళు తెరిచి చూసింది. రెప్పలు బరువుగా వున్నాయి.

"వచ్చారా" అంది

తల వూపాను.

"చూశావా ఫీశ్ళం చేశారో.. ఎంతెంత మాటలన్నారో.. అభం శుభం తెలియని పసివాడి మీద.." అంటూ మొదలెట్టింది.




"మీనాక్షి కొడుకు గురించేనా"

"అత్తయ్య చెప్పిందా ?

"ఆహ.. అంతా విన్నాను. అదేం మనస్సులో పెట్టుకోకు. నేనెన్నిసార్లు చెప్పినా మనస్సుకి పట్టించుకోలేదు. ఈ ఇబ్బందుల్లో ఈ బాధ్యతలను ఈ గొడవలూ నువ్వు పడలేవు. అదంతా వాడికి వదిలేసి నిశ్చింతగా వుండమంటే విన్నావుకావు. కూతుళ్ళ కాపరాలు తెరిపిగా వున్నాయి. వాళ్ళకేం లోటు, చెప్పు. శంకరం సంగతే ముఖ్యం. తల మునకలయే అప్పుల్లో వున్నాడు. చిన్నవాడు. చిలో బొలో మంటూ వుండాల్సిన వయస్సులో ఈ బరువు ఎల్లకాలమూ వాడు భరించలేడు. వాడు చెప్పినట్లాల్లావిను. కొడుకు తెరిపినపడే మార్గం చూసుకోవాలి గాని ఇలాంటి చిల్లర మల్లర గొడవలు తెచ్చి పెట్టుకోకూడదు. ఈ మనవడిని చూసుకుంటూ తెరిపిగా వుండు" అన్నాను.

"నువ్వు ఆమాటే అంటున్నావా? అంది కామేశ్వరమ్మ ముఖం పక్కకు తిప్పుకుని.

"ఎవరైనా ఆమాటే చెబుతారు. నీ మంచికోరి చెప్పాను. అపార్థం చేసుకోకు"

ఆమె తల అడ్డంగా ఊపింది. ఆమెకు ఇప్పటికీ నా సలహా రుచింపలేదు. "నేనేం పాపంచేసాను. ఎవర్ని కాదని ఎవరికి పెట్టాను. కూతురు పిల్లలు పరాయి వాళ్ళం" అంది.

"డబ్బు చికాకులు అనిపిస్తాయి. వాడికి మాత్రం అభిమానం లేకేనా?"

"ఉంటే అంతంత మాటలు అనగలడా? నిల్చున్నపాటున వెళ్ళి దిగరమ్మని ఖచ్చితం చేశాడు గదా అదేనా మర్యాదా?"

చేతిలో పెరుగుగిన్నెతో చంకని పసివాడితో కోడలు రావటం గమనించి ఆమె లోపలికి పోగానే గొంతు తగ్గించి "ఇది ఏమీ ఎరగని నంగనాచిలా పైకి ఇలా కనపడుతుందా నిలువెల్లా విషం. ఇదే చేసింది అంతా ఉన్నవీ లేనివీ వాడికి చెప్పి పురెక్కించింది. తనిక్కడ అష్ట కష్టాలు పడి పోతున్నానంటూ వాళ్ళ వాళ్ళకి ఉత్తరాలు రాసింది. వాళ్ళు అతి తెలివి తేటలు ఒలక బోస్తూ జవాబులు. ఇవేవీ అఖ్ఖర్లేదు, వాడికి. మీనాక్షి కొడుకుని తీసుకురావటం వాడికి సమస్యలా కనిపించింది. ఉత్తవెధవలా తయారయాడు. కూతుళ్ళేనయం. అయ్యో అమ్మ కష్టాలు పడుతోందని వాళ్ళు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటారు. వీడికి నా మీద రవ్వంత జాలికూడా లేదు." అంది.

"ధూరంగా వున్నవాళ్ళు అలా అని పిస్తారు. ఓచోట చేరితే అంతా అలాగే వుంటారు" అన్నాను.

"అలా అనకు. మీనాక్షి ఇంది రమ్మలు లేరు."

"ఇంతకీ శంకరం ఏడీ?" అని అడిగాను.

"ఏమో ఎక్కడి కెళ్ళాడో." అంది కామేశ్వరమ్మ విసురుగా.

వంటగదిలో కెళ్ళాను. ముసలావిడ మెల్లగా అంది "శంకరం మీనాక్షి దగ్గరకు వెళ్లాడు. కుఱ్ఱవాడ్ని తీసుకు వస్తానని"

"ముందు తీసుకు పొమ్మనటం ఎందుకు? ఇప్పుడు మళ్లీ తీసుకురావటం ఎందుకు?" అన్నాను.

"ఇది రెండు రోజుల్నించీ ఇలా ఉంది. అదే ధ్యాస. నానా అవాకులూ చవాకులూను. నానా అల్లరి. "అడుగో మాటల్లోనే వచ్చేశాడు" అంది ముసలావిడ గుమ్మం వైపు తిరిగి.

చంకలో చంటివాడ్ని ఎత్తుకున్న శంకరాన్ని చూశాను. వాడు నన్ను చూసి నవ్వి తల్లి పడుకున్న గదిలోకి వెళ్లాడు. మంచం వార కుర్చీలాక్కుని కూర్చుని 'అమ్మా' అని పిలిచాడు.

కామేశ్వరమ్మ కళ్లుతెరిచింది.

ఎదురుగ్గా కొడుకు!

కొడుకు చంకలో చంటివాడు!

గుమ్మం వైపు చూసింది.

కోడలు కొడుకునెత్తుకుని గుమ్మానికి ఆనుకుని నిలబడి వుంది.

"వీడ్ని తీసుకువచ్చాను. చూడు." అంటూ చంటివాడ్ని ఆమె పక్కన కూర్చో బెట్టాడు.

కామేశ్వరమ్మ అభిమానం ముఖం మీదకనబర్చుకుంటూ "ఎందుకు తీసుకు వొచ్చావు ఈ రోగిష్టి వెధవను.. ఈ శనిగాడ్ని....ఉన్న ఖర్చు చాలకనా" అంటూ దెప్పింది.

"ఏదో ఇబ్బందుల్లో వుండి మనస్సు సరిగాలేక అన్నానుగాని ఈ పసివాడంటే నాకు ద్వేషమా. నా మాటలు పట్టించుకోకు. వీడ్ని జాగ్రత్తగా చూసి ఆరోగ్యం బాగుపడింతర్వాత పంపిద్దాం, మన చంటివాడికి వీడుతోడు" అన్నాడు శంకరం.

కామేశ్వరమ్మకు కళ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి.

"ఇక సంసార బాధ్యతలంటావా, ఏదో ఇలాగే కానిచ్చేద్దాం. నిశ్చింతగా వుండు. మనస్సు పాడు చేసుకోకు."

కోడలు ముఖం పరీక్షగా చూస్తోంది కామేశ్వరమ్మ. చంకలో కుఱ్ఱవాడి కిందకుదింపి ఆమె మంచం దగ్గరకొచ్చి మీనాక్షి కొడుకుని ఎత్తుకుంది.

భార్య గుమ్మం దాటుతూండగా తల్లి ముఖం మీదికి వంగి మెల్లగా అన్నాడు శంకరం "ఈ కోడల్ని మాత్రం అపార్థం చేసుకోకు. ఇంటిగొడవలు అది ఏనాడు నా దగ్గర ఎత్తలేదు. నీగురించి ఒక్క ముక్క చెడుగా చెప్పలేదు. నేనే తొందరపడి నిన్ను నాలుగూ అన్నాను. నీ కోడలు నాకు చెప్పింది 'పెద్దావిడ, ఆవిడ ఇష్టానికి ఆవిడ్ని వదిలెయ్యండి. ఆ కుఱ్ఱవాడ్ని ఆరోగ్యం కుదుటపడే దాకా దగ్గర వుంచుకోవాలని వుంది. అలాగే కానియ్యండి' అని. ఆమె సలహా మీదనే వీడ్ని తీసుకువచ్చాను. ఆమెను అపార్థం చేసుకోకు. అదొక్కటే నేను కోరేది. డబ్బు ఇబ్బందులు ఎప్పుడూ వుండేవే. మనుష్యుల్ని అపార్థం చేసుకుని అనుమానాలు పెంచుకుని లేని పోని గొడవలు పెంచుకోవద్దు." అన్నాడు శంకరం అనునయంగా.

కామేశ్వరమ్మ కళ్లుమూసుకుని పక్కకు ఒత్తిగిల్లింది.

బయటికి వచ్చిం తర్వాత "మనుష్యులెలాగుంటారో చూశారా బాబయ్యా" అన్నాడు.

"ఇంతకీ మీ ఆవిడ అంత ఔదార్యం చూపించిందంటే ఆశ్చర్యంగా వుంది" అన్నాను.

"ఔదార్యం లేదు మట్టిగడ్డలూ లేదు. అది మనం ఎలా ఆశిస్తాం? కన్న తల్లికి కొడుకు మీద అక్కసు వున్నప్పుడు ఎక్కడ్నించో వచ్చిన అమ్మాయికి ఆడబడుచు బిడ్డల మీద అత్తగారి మీద పెద్ద ఔదార్యాలు ఎక్కడ్నించి వస్తాయి. అయితే ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఇంట్లో గొడవలు పెద్ది చేసుకుని అల్లరి పడితే ఒరిగేదేం లేదని చెప్పింతర్వాత సన్నసన్నగా సణుగుతుంది. తప్ప పెద్ద గొడవలు లేవదియ్యటం లేదు" అన్నాడు శంకరం.

"అయితే మీ ఆవిడ సలహా ఇవ్వ లేదా వాడ్ని తీసుకురమ్మని." అని అడిగాను.

"అబ్బే.. అదంతా ఉత్తది.. ఆమె మీద పడి ఏడవకుండా సదుబాటు చేశాను. అమ్మని చూస్తే నాకే బాధనిపించింది. ఆవిడకు ఈడబ్బు బాధ్యత.. ఆపిల్లాడు. ఈ ఫొటోలు.. ఇవన్నీ పట్లు...ఈ పట్లు తప్పిస్తే.. ఆవిడ ఒక్కొక్క ప్రాణమే ఎగిరి పోతున్నట్టుగా విలవిల్లాడిపోతుంది. ఖర్చులు.. ఖర్చు.. నిండా మునిగిన వాడికి చలేమిటి: అందుకోసరమే తీసుకొచ్చేశాను.. ఏ వలనూ పెద్దగా పట్టించుగోకుండా వుండటమే మన తెలివి.." అన్నాడు శంకరం.

కామేశ్వరమ్మ నీరసంగా "బుజ్జిబాబూ" అని మీనాక్షి కొడుకుని పిలుస్తూంది గదిలోంచి.

